# నాణ్యతా ప్రమాణాలపై అధికారుల ప్రత్యేక దృష్టి

**పెడన, పెన్ పవర్, జులై 13 :** కృత్తివెన్ను మండలంలోని ఇంతేరు--పార్వతీపురం ప్రధాన రహదారిపై కొనసాగుతున్న సీసీ రోడ్డు,గ్రావెల్స్ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను మచిలీపట్నం విజిలెన్స్ విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీడీకే మోజెష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ రాజేశ్వరరావు, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి ఆయన నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి, పనుల పురోగతి, నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో ఉపయోగిస్తున్న సిమెంట్, కంకర, ఇసుక తదితర సామగ్రి ప్రమాణాలకు అనుగుణంగా



ఉన్నాయా, కాంక్రీటు మిశ్రమ నిష్పత్తులు సాంకేతిక మార్గదర్శకాలకు అనుసరించి అమలవుతున్నాయా అనే అంశాలను అధికారులు పరిశీలించారు. పనులకు సంబంధించిన అంచనాలు, కొలతల పుస్తకాలు, ఇతర సాంకేతిక రికార్డులను కూడా తనిఖీ చేశారు. ప్రజాధనంతో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిలో పారదర్శకత, నాణ్యత తప్పనిసరిగా పాటించాలని, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని కాంట్రాక్టర్లు, సంబంధిత సిబ్బందికి సూచించారు. విజిలెన్స్ అధికారుల తనిఖీలతో పనుల్లో మరింత జవాబుదారీతనం పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఏన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# సోషల్ మీడియాలో మహిళా నాయకులపై అసభ్య పోస్టులు, బాడీ షేమింగ్‌ను సహించం ఐ టిడిపి నేతలు

**గుంటూరు, పెన్ పవర్, జులై, 13 :** సోషల్ మీడియా వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, డిప్యూటీ స్పీకర్ రఘురామ రామకృష్ణమ రాజు, ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీద అసభ్య పదజాలతో దూషించిన అద్దంకి శివాజీ అనే వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకోవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఐటీడీపీ నేతలు, నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు పి. సాంబశివరావు (పి. శివ),షేక్ శంశున్నిసా మాట్లాడుతూలి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు శ్రీమతి గళ్ళా మాధవి పై సోషల్ మీడియాలో కొంతమంది వ్యక్తులు హద్దులు దాటి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని బాడీ షేమింగ్ చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం, బూతులు తిట్టడం వంటి చర్యలు అత్యంత ఖండనీయమన్నారు. ఇటీవల గళ్ళా మాధవి పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన విషయాన్ని



ఎమ్మెల్యే స్వయంగా మీడియా సమావేశం నిర్వహించి ఖండించినప్పటికీ, సంబంధిత వ్యక్తుల ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. పైగా తాము ఇలాగే కొనసాగుతామని, తమను ఎవరూ ఏమీ చేయలేరనే ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అద్దంకి శివాజీ పేరుతో ఉన్న సోషల్ మీడియా ఖాతా ద్వారా ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మాత్రమే కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, పరిటాల శ్రీరామ్, రఘురామకృష్ణంరాజు తదితర నాయకులపై కూడా అసభ్యకరమైన పోస్టులు, కామెంట్లు చేస్తున్నారని ఆరోపించారు.

కులాలు, వ్యక్తిగత అంశాలు ప్రస్తావిస్తూ అవమానకరంగా మాట్లాడటం ద్వారా సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఒక మహిళా ప్రజాప్రతినిధి పై ఈ స్థాయిలో అసభ్య పదజాలం ఉపయోగించడం, బాడీ షేమింగ్ చేయడం సమాజానికి చెడు సంకేతాలు పంపుతుందని పేర్కొన్నారు. రాజకీయంగా విభేదాలు ఉంటే పాలనాపరమైన అంశాలపై విమర్శలు చేయవచ్చని, కానీ వ్యక్తిగత దూషణలు, మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కావని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అద్దంకి శివాజీ పేరుతో ఉన్న సోషల్ మీడియా ఖాతాను నిర్వహిస్తున్న వ్యక్తిని గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇలాంటి ఫేక్ అకౌంట్ల వెనుక దాగి అసభ్య ప్రచారానికి పాల్పడుతున్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తూ మహిళలపై, ప్రజాప్రతినిధులపై అసభ్య వ్యాఖ్యలు చేసే వారందరికీ చట్టం తన పని చేస్తుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు ఐటీడీపీ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఫిర్యాదు కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఐటీడీపీ కమిటీ సభ్యులు మల్లవరపు కిరణ్, తాడిగిరి వెంకటేష్,వెంకటేశ్వర్లు, శివా, షేక్ అల్తాఫ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 13:** చిలకలూరిపేట: మండలంలోని చిన్న పసమర్రు గ్రామం సమీపంలోని జాతీయ రహదారి-16పై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొప్పూడి గ్రామానికి చెందిన కోడూరు వెంకట రమణమ్మ (65) మృతి చెందారు.పొగాకు కంపెనీకి కూలీ పనికి వెళ్తూ రోడ్డు దాటుతున్న వెంకటరమణమ్మను ఒంగోలు వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమెతో పాటు బైక్ నడుపుతున్న వ్యక్తికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని చిలకలూరిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ వెంకటరమణమ్మ మృతి చెందారు. ఘటనపై చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్, జులై, 13 :** ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న అర్జీలను సకాలంలో నాణ్యతతో పరిష్కరించి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులతో కలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 237 అర్జీలు అందాయి. వీటిలో రెవెన్యూ సేవలకు సంబంధించి 70, పురపాలక-పట్టణాభివృద్ధికి సంబంధించి 62, పోలీసు 26, పంచాయతీరాజ్ 22, జల వనరులు



13, విద్యుత్ 9, వైద్యారోగ్యం 6, పౌర సరఫరాలు 4 అర్జీలు వచ్చాయి. ప్రజారవాణా, సహకార, విభిన్న ప్రతిభావంతులు, విద్య, కార్మిక, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, ఆర్ఐవో, రహదారులు భవనాల శాఖలకు రెండు చొప్పున అర్జీలు వచ్చాయి. వ్యవసాయం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, కాలేజీ విద్య, డీఆర్‌డీఏ, ఎండోమెంట్, గృహ నిర్మాణం, ఎల్‌డీఎం, మైన్స్, నైపుణ్యాభివృద్ధి శాఖలకు ఒక్కో అర్జీ వచ్చింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో అర్జీలు సమర్పిస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకుని, మార్గదర్శకాలకు అనుగుణంగా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అర్జీదారులకు పరిష్కారంపై స్పష్టమైన సమాచారం అందించాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# చీరాల జాండ్రపేట కూరగాయల మార్కెట్‌లో అగ్నిప్రమాదం

## మధ్యాహ్న భోజన విరామం కావడంతో పెను ప్రమాదం తప్పింది

**చీరాల, పెన్ పవర్, జులై13 :** చీరాల మండలం, జాండ్రపేట కూరగాయల మార్కెట్‌లో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పందిళ్లకు ఒక్కసారిగా మంటలు అంటుకుని వేగంగా వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఘటన జరిగిన సమయంలో మధ్యాహ్న భోజన విరామం కావడంతో మార్కెట్ దుకాణాలు మూసివేసి ఉండగా, దుకాణదారులు, వ్యాపారులు, కొనుగోలుదారులు అక్కడ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు అధికారులు తెలిపారు. మంటలను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు.



సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో మంటలు మరింత విస్తరించకుండా నివారించగలిగారు. ఘటనలో పందిళ్లు దగ్ధమవగా, ఆస్తి నష్టంపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న చీరాల మండల తహసీల్దార్ గోపికృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులను అడిగి తెలుసుకొని విచారణ చేపట్టాలని ఆదేశించారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, ప్రమాదానికి గల అసలు కారణం అధికారుల విచారణ అనంతరం వెల్లడికానుంది.

# హైయర్ బస్సుల డ్రైవర్ల డిమాండ్లపై చీరాలలో నిరసన

**చీరాల, పెన్ పవర్ జులై 13 :** బాపట్ల జిల్లా చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో హైయర్ బస్సుల డ్రైవర్లు సోమవారం తమ సమస్యల పరిష్కారం కోరుతూ శాంతియుత నిరసన చేపట్టారు. పీఎఫ్, ఈఎస్ఐ అమలు, సమాన పనికి సమాన వేతనం, వారానికి ఒక రోజు వారాంతపు సెలవు, ప్రతి





డ్రైవర్‌కు రెండు జతల యూనిఫామ్‌లు కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని దినానికి సుమారు రూ.24 వేల వేతనం చెల్లించాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం చాలా తక్కువ జీతాలు ఇస్తున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో ప్రస్తుత వేతనాలతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని తెలిపారు. ఏళ్ల తరబడి హైయర్ బస్సులు నడుపుతున్న స్థానిక డ్రైవర్లను పక్కనపెట్టి బయట ప్రాంతాల నుంచి డ్రైవర్లను తీసుకువచ్చి బస్సులు నడపడం సరికాదని వారు ఆరోపించారు. తమ డిమాండ్లను తెలియజేస్తూ నిరసన చేపట్టిన సమయంలోనే ఇతర డ్రైవర్లతో బస్సులు నడపించడం కార్మికుల హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం శ్యామల కుమారిని సంప్రదించగా, హైయర్ బస్సుల డ్రైవర్ల నియామకాలు, వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు సంబంధిత హైయర్ బస్సుల యాజమాన్య పరిధిలోని అంశాలని, ఆర్టీసీకి వాటితో ప్రత్యక్ష సంబంధం లేదని స్పష్టం చేశారు. బస్సులు నడిపే ప్రతి డ్రైవర్‌కు తప్పనిసరిగా మెడికల్ ఫిట్‌నెస్, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జి ఉండాలని, నిబంధనలకు అనుగుణంగా ఉన్న వారికే బస్సులు నడిపేందుకు అనుమతి ఉంటుందని తెలిపారు. డ్రైవర్ల సమస్యలను సంబంధిత యాజమాన్యంతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని హైయర్ బస్సుల డ్రైవర్లు హెచ్చరించారు. మెడికల్ ఫిట్‌నెస్, చెల్లుబాటు అయ్యే లైసెన్స్, బ్యాడ్జి లేని వ్యక్తులతో బస్సులు నడపడాన్ని నిలిపివేయాలని, ప్రభుత్వం కల్పించిన కార్మిక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం జీతభత్యాలు, యూనిఫామ్‌లు, వారాంతపు సెలవులు కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు.


# నెలవారీ నిర్వహణ పనులతో మంగళవారం వేటపాలెం పరిధిలో విద్యుత్ అంతరాయం

**వేటపాలెం, పెన్ పవర్, జూలై 13:** నెలవారీ విద్యుత్ నిర్వహణ, మరమ్మతు పనుల దృష్ట్యా నేడు (జూలై - 14 మంగళవారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వేటపాలెం ఆపరేషన్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు. నీలకంఠాపురం, కె పాల్ కాలనీ, దేశాయిపేట, రామానగర్, శాంతినగర్, ఐటీఐ కాలనీ, వివేకానంద కాలనీ ప్రాంతాల్లో ఈ సమయంలో విద్యుత్ అంతరాయం ఉండనుందని పేర్కొన్నారు. విద్యుత్ నిర్వహణ పనులు సజావుగా పూర్తయ్యేలా ఆయా ప్రాంతాల



వినియోగదారులు సహకరించాలని అసిస్టెంట్ ఇంజనీర్, ఆపరేషన్ సెక్షన్, వేటపాలెం విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యుత్ అంతరాయం సమయంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర అవసరాల కోసం ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

# కనపర్రు గ్రామంలోని నైస్ స్కూల్ నందు విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయం



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, జూలై 13 :** నాదెండ్ల మండలంలోని కనపర్రు గ్రామంలోని నైస్ పాఠశాల విద్యార్థుల విద్యార్థులకు జాగర్లమూడి జ్యోతిర్మయి సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ పండరిపురం ఆధ్వర్యంలో ఉచిత భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కాపు వెంకట్రావు విద్యార్థి విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థ దశనించే చక్కని క్రమశిక్షణ నిజాయితీ పట్టుదలతో చక్కగా చదువుకొని తమకు చదువు చెప్పిన పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ బాంద్రీపురం అధ్యక్షులు లంక ఆదినారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరమణ బిట్రా నాగేశ్వరరావు ప్రసాద్ రాజు సింగారావు చెంచు పున్నయ్య ,దాసునయన రాఘవయ్య శ్రీనివాసరావు, శ్రీకాంత్ ఆలంగార్ మోహన్ పాల్గొనడం జరిగింది

# 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు

## -సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

**భట్టిప్రోలు, పెన్ పవర్ జూలై, 13:** జీవో నెం.53 ప్రకారం 2003 డీఎస్సీ ద్వారా ఎంపికై,2004కు ముందు నోటిఫికేషన్ పొందినప్పటికీ పరిపాలనా కారణాలతో ఉద్యోగంలో చేరిక ఆలస్యమైన సుమారు 11 వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యా యులకు సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానం అమలు చేస్తూ రాష్ట్ర



ప్రభుత్వం జీవో విడుదల చేయడంపై భట్టిప్రోలు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద సోమవారం ఆనందోత్సాహాల మధ్య కేక్ కట్ చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ,2003 డీఎస్సీ ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్‌ను గుర్తించి వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ అభినందనీయ నిర్ణయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వేలాది కుటుంబాలకు భవిష్యత్ భరోసాను కల్పిస్తుందని అన్నారు. ఏపీసీపీఎస్ఈఏ బాపట్ల జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ, గతంలో సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ,ఫ్యామిలీ పెన్షన్ వంటి కీలక ప్రయోజనాలను కల్పించిన ముఖ్యమంత్రి ఇప్పుడు 2004కు ముందు నోటిఫికేషన్ పొందిన ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. హామీ ఇవ్వకుండానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు పాత పెన్షన్ అమలు చేశారని, ఉద్యోగులు, ఉపాధ్యాయుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు అంబటి జాకబ్, ఆచారి,గణేష్, యుటిఎఫ్ నాయకులు సురేష్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొని సీఎం నిర్ణయాన్ని హర్షిస్తూ మిఠాయిలు పంచుకుని సంబరాలు నిర్వహించారు.

# ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేసిన దేవకి వెంకట సుబ్రహ్మణ్యం





**బాపట్ల:( పెన్ పవర్) జూలై 13** బాపట్ల పట్టణంలోని ఏం యస్ ఆర్ కల్యాణ మండపంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చైతన్య కమిటీని ఏర్పాటు చేయడం ఆర్యవైశు ్యలను చైతన్యవంతులుగా చేయాలని ఉద్దేశంతో ఇంటర్నేషనల్ వైశ్ ఫెడరేషన్ కోన శ్రీనివాసరావు రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు బాపట్ల కు చెందిన ఆర్యవైశ్య నాయకులు వెల్లంపల్లి సత్యనారాయణ రాష్ట్ర అధ్యక్షులుగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రముఖ వ్యాపారవేత, పారిశ్రామికవేత, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా,దేవకి వెంకట సుబ్రహ్మణ్యం పనిచేశారు. ఆయన పని చేసే విధానంలో ఎవరికీ ఎలాంటి అవసరమైన ముందుండి పనిచేసేవారు ఆయన పదవులకు వన్నెతెచ్చిన తీరును చూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్నికైనందుకు సభ్యులందరూ హర్షం వ్యక్తం చేశారు. సుబ్రహ్మణ్యం గతంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా పని పనిచేస్తున్నారు. ఆయన ఏపి రాష్ట్ర రాజకీయ చైతన్య కమిటి 2026-2029 కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేసిన ప్రముఖ వ్యాపారవేత్త దేవకి వెంకట సుబ్రహ్మణ్యం మరియు తదితరులతో బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు, అభిమానులు, మహిళలు వందలాదిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) గడువును మూడు నెలలు పొడిగించాలి : సీపీఐ

**గుంటూరు, పెన్ పవర్, జులై, 13 :** ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియలో అనేక లోపాలు చోటుచేసుకుంటున్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని సీపీఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును మరో మూడు నెలలపాటు పొడిగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం గుంటూరు జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల సంఘం ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగిపోతున్నాయనే ఫిర్యాదులు రాష్ట్రవ్యాప్తంగా వస్తున్నాయని తెలిపారు. మరణించినవారి పేర్లు, నకిలీ ఓటర్లను తొలగించడం అవసరమే అయినప్పటికీ, ఆ పేరుతో నిజమైన ఓటర్ల హక్కులు దెబ్బతినకూడదన్నారు.



గడువు ముగిసేలోపు నమోదు ప్రక్రియ పూర్తి చేయలేని వేలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన వారికి కూడా సరైన సమాచారం అందడం లేదని, సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తుల స్థితి తెలియని పరిస్థితి నెలకొన్నదన్నారు. ఆధార్, ఎపిక్ వివరాల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నా దరఖాస్తులు నిలిచిపోతున్నాయని, చాలా చోట్ల బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఫారాలు అందించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరగాలని అన్నారు. రాజకీయ ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తికాకపోవడం ఆందోళనకరమని, ప్రజలకు సరైన అవగాహన కల్పించి నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు ఎస్ఐఆర్ గడువును మరో మూడు నెలలు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సీపీఐ నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాత్సవకు వినతిపత్రం అందజేసి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, సీపీఐ నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, జిల్లా సమితి సభ్యులు నూతలపాటి చిన్న, బి. వెంకటేశ్వరరెడ్డి, జంగాల చైతన్య, పీవీ జగన్నాథం, నాయకులు బొట్టు శ్రీను, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## బధిరుల పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం



**పర్చూరు, పెన్ పవర్, జులై 13:** బాపట్ల జిల్లా, పర్చూరు మండలం, నాగులపాలెంలోని బధిరుల పాఠశాలలో సోమవారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్, నూతలపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ దేవరకొండ శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు వర్షాకాలంలో సంక్రమించే సీజనల్ వ్యాధులు, వాటి నివారణకు పాటించాల్సిన పరిశుభ్రత, వ్యక్తిగత జాగ్రత్తలు, ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ముందస్తు జాగ్రత్త చర్యగా ఆయుష్ నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బధిరుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, సిబ్బంది, 30 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల నుండి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి : అదనపు కమిషనర్ ఐ.కిషోర్




**గుంటూరు, పెన్ పవర్, జులై, 13:** నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అదనపు కమిషనర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ, పిజిఆర్ఎస్ కు అందే ఫిర్యాదుల్లో ఎక్కువగా పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు, త్రాగునీటి సరఫరా మరియు వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించినవే వస్తున్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే, ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి వివరించి, ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా 43 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 12, ఇంజినీరింగ్ విభాగం 15, రెవెన్యూ విభాగం 6, ప్రజారోగ్య విభాగం 4, ఉపా సెల్ విభాగం 2, ఎలక్షన్ సెల్ 1, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 3 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

## వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు ఖబర్దార్ : రాచకొండ లక్ష్మయ్య



**గుంటూరు, పెన్ పవర్, జులై, 13 :** వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడుసార్లు ప్రతిపక్ష నాయకులు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన నాయకున్ని నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నావ్. జాగ్రత్త నీ బతుకెంత వర్తకుంట్ల చేపలు పట్టేవాడు నువ్వు చంద్రబాబు నాయుడు మాట్లాడతావా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు భావితరాల భవిష్యత్ పునాదివ్యసేన నాయకుడు అప సౌకర్యం మాట్లాడుతూ నేలక కోసం ఏమనుకుంటున్నావు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు వైసిపి నా నాయకుడు నాగార్జున ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ అధికారులు అరెస్టు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలి మళ్లీ ఏ వ్యక్తి అయినా సరే ముఖ్యమంత్రిని ఐటి మంత్రిని ఉప ముఖ్యమంత్రిని ఎవరినైనా కించపరిచి మాట్లాడితే ఊరుకునేది లేదని పత్రిక పూర్వకంగా హెచ్చరిస్తున్నారని జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు

## విద్యార్థి ఫీజుకు రూ.5 వేల ఆర్థిక సాయం



**వేటపాలెం, పెన్ పవర్, జూలై 13: :** చీరాల మండలం, దేవాంగపురి పంచాయతీ వాసవీనగర్‌కు చెందిన భాగవత్ భక్తి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓ విద్యార్థి ఫీజు కోసం రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో 8వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న చింతం హరీష్ విద్యా ఫీజు నిమిత్తం ట్రస్ట్ ఛైర్మన్, విశ్రాంత ప్రొఫెసర్ డా. కోట శివశంకరరావు సోమవారం కళాశాల యాజమాన్యానికి రూ. 5 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో హరీష్ ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బండ్ల బాపయ్య విద్యాసంస్థల కమిటీ కార్యదర్శి, కరస్పాండెంట్ చల్లా వాసుదేవరావు, పూర్వపు కరస్పాండెంట్, ఉపాధ్యక్షులు గొల్లపూడి సీతారాం, హైస్కూల్ ఇన్‌చార్జి బి. సుబ్బారావు, ఏవో జి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల కల సాకారం చేస్తూ జీవో 53 ఉత్తర్వులు



**విజయవాడ, పెన్ పవర్, జులై, 13:** ఏపీ ఎన్ జి జి ఓ రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ ప్రధాన కార్యదర్శి డి.వి రమణ లు హర్షం వ్యక్తంచేశారు. జి ఒ నంబర్ ఉత్తర్వులు విడుదల చేయడం ద్వారా సుమారు 11,000 మంది ఉద్యోగులు మరియు వారి కుటుంబాలలో ఆనందం వ్యక్తం చేస్తున్నారని రెండు చారిత్రక నిర్ణయం వేలాది కుటుంబాల జీవితాల్లో కొత్త ఆశలు నింపుతూ, ఉద్యోగుల చరిత్రలో చిరస్థాయిగా నిలిచే సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని అన్నారు . మెమో-57 ప్రకారం 2004కు ముందు నోటిఫికేషన్ పొందిన పోస్టులపై నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) నుంచి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఉద్యోగుల దీర్ఘకాలిక పోరాటానికి దక్కిన గొప్ప విజయమని ఆయన పేర్కొన్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా వేలాది మంది ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించడం ఆనందదాయకమని అన్నారు. ఈ నిర్ణయం ద్వారా సుమారు 11 వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు జీవితాంతం భరోసా, సామాజిక భద్రత మరియు ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల విద్యాసంస్థలు, వివిధ సొసైటీలలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచిన నిర్ణయాన్ని ఉద్యోగుల సేవలకు గౌరవం కల్పించడమే కాకుండా, వారి అనుభవాన్ని మరింత కాలం రాష్ట్ర అభివృద్ధికి వినియోగించే అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగుల న్యాయమైన ఆకాంక్షలను గౌరవిస్తూ తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ పయ్యావుల కేశవ్ జి ఓ విడుదలలో భాగసామ్యులైన ఉన్నతాదికారులకు సంబంధిత అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు మరియు ప్రత్యక్షంగా, పరోక్షంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగుల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, భవిష్యత్ భద్రత మరియు న్యాయమైన డిమాండ్ల పరిష్కారం దిశగా ఏపీ ఎన్జీవో సంఘం అడుగులు వేస్తుందని సంఘ రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ జేఏసీ చైర్మన్ శ్రీ ఎ. విద్యాసాగర్ ప్రధాన కార్యదర్శి డి వి రమణలు తెలిపారు.

## రామన్నపేట పీహెచ్‌సీలో పోషణ్ కిట్ల పంపిణీ




**వేటపాలెం, పెన్ పవర్, జులై 13:** చీరాల అసెంబ్లీ నియోజకవర్గం వేటపాలెం మండలంలోని రామన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సోమవారం గర్భిణీలు, బాలింతలకు ఉచిత పోషణ్ కిట్లను పంపిణీ చేశారు. బాపట్ల పార్లమెంట్ సభ్యులు, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ శ్రీ తెన్నేటి కృష్ణప్రసాద్ చొరవతో బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గ వ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా లబ్ధిదారులు పోషకాహార కిట్లను అందుకుని తమ ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొంటూ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలకు అవసరమైన పోషకాహార పదార్థాలతో కూడిన కిట్లను అందజేశారు. గెయిల్ (ఇండియా) లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (జూ=) నిధుల మద్దతుతో, అవంత్ ఫౌండేషన్ మరియు కృష్ణప్రసాద్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోషణ్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

## విజయవాడ- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే భూసేకరణ

### రైతులకు న్యాయం చేస్తాము : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.



**బాపట్ల,(పెన్ పవర్) జులై 13 :** విజయవాడ--బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూములు అందజేసిన రైతుల కు తగిన న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వి.తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు విజయవాడ-- బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూములు అందజేసిన దక్షిణ అద్దంకి గ్రామానికి చెందిన రైతుల కు నష్టపరిహారం చెల్లింపుకు సంబంధించిన అంశాలపై రైతులతో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవిజయవాడ--బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం కోసం భూములు అందజేసిన దక్షిణ అద్దంకి గ్రామానికి చెందిన మొదటి ఫేస్ లో 11 మంది రైతుల కు తగిన న్యాయం చేయడం జరుగుతుందని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు తమ భూములకు సంబంధించిన నష్టపరిహారం, పెండింగ్‌లో ఉన్న చెల్లింపులు, ఇతర సమస్యలను రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల అభ్యర్థనలు, అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ ఓర్పుగా విని సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు ప్రభుత్వ నిబంధనలు, చట్టబద్ధమైన విధానాలకు అనుగుణంగా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత రెవెన్యూ మరియు భూసేకరణ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. నష్టపరిహారం చెల్లింపులకు సంబంధించిన పెండింగ్ అంశాలను అధికారులు వెంటనే పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, వేగవంతంగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ల్యాండ్ అక్విటిన్స్ పర్యవేక్షకులు ఆజాద్, శ్రీలక్ష్మి రెవెన్యూ, భూసేకరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పి జి ఆర్ ఎస్ లో అర్జీలు పరిష్కరం చేసిన డిఆర్డీఏ పి డి.బి.సింగయ్య ను అభినందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.



**బాపట్ల,( పెన్ పవర్ )జులై 13 :** పి జి ఆర్ ఎస్ లో అర్జీదారులు అందజేసిన ప్రజా సమస్యల పరిష్కారం లో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన జిల్లా ఉత్తమ అధికారి డిఆర్డీఏ పి డి. బి. సింగయ్య ను మెమెంటో శాలవ తో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి. జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట సత్కరించి అభినందించారు. సమస్యలు పరిష్కారం సమయంలో అధికారి ప్రవర్తన 91.75%, సక్రమమైన పద్ధతులు పాటించడం 94.85%, అర్జీదారునికి సరియైన సమాచారం ఇవ్వడం 95.88%, అధికారి సామర్థ్యం తదితర అంశాలలో జిల్లాలో స్థాయిలో మొదటి స్థానంలో ఉన్నారు.

## ఆర్‌వీఆర్ జేసీకి జాతీయ స్థాయిలో 14వ సారి ఏఏ రేటింగ్ 98 స్టార్ అవార్డులు లభ్యం

గుంటూరు రూరల్: ఎన్‌పీటీఈఎల్ పరీక్షా ఫలితాల్లో తమ కళాశాల మరోసారి అద్భుత ప్రతిభ కనబరిచి వరుసగా 14వ సారి ప్రతిష్టాత్మక ఏఏ రేటింగ్‌ను సాధించటంతో పాటూ 98 స్టార్ అవార్డులు అందుకోవడం, దేశ వ్యాప్తంగా వున్న ఎన్‌పీటీఈఎల్ అన్ని లోకల్ చాప్టర్స్‌లో తమ కళాశాల అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జె మురళీమోహన్, డాక్టర్ జగదీష్‌లు తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాజమాన్యం మాట్లాడుతూ విద్యార్థుల ఈ అద్భుత విజయాలు కళాశాలలో అందిస్తున్న నాణ్యమైన సాంకేతిక విద్య, ఆధునిక బోధనా విధానాలకు నిదర్శనమన్నారు. ప్రతిష్ఠాత్మక గుర్తింపులో భాగంగా,కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి 259 గోల్డ్, 672 సిల్వర్, 1,034 ఎలైట్ గ్రేడ్‌లను సాధించారన్నారు. వివిధ కోర్సుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 84 మంది విద్యార్థులు టాపర్ సర్టిఫికెట్లు పొందారన్నారు. ఇటీవల చైన్నైలోని ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో కళాశాల లోకల్ చాప్టర్ సమన్వయకర్త డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు కళాశాల తరఫున ఈ ప్రతిష్టాత్మక అవార్డులను స్వీకరించారన్నారు. ఎన్‌పీటీఈఎల్ కోర్సులు ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే అత్యుత్తమ వేదికగా నిలుస్తున్నాయని, స్టార్ గుర్తింపు పొందిన విద్యార్థులకు ఐఐటీలలో నెలకు రూ. 15,000 స్టైపెండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్ అవకాశాలు, అత్యాధునిక సాంకేతిక అంశాలపై హ్యాండ్స్‌ఆన్ వర్క్‌షాప్‌లు, అలాగే ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ప్లేస్‌మెంట్ అవకాశాలను మెరుగుపరచుకునే ప్రత్యేక ప్రయోజనాలు లభిస్తాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికేషన్ కోర్సుల్లో విజ్ఞాన్ నిరులకు ఏ గ్రేడ్

గుంటూరు రూరల్: విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల మరోసారి జాతీయ స్థాయిలో తన ప్రతిభను చాటుకుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. సోమవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వయం ఎన్‌పీటీఈఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనవరి--ఏప్రిల్ 2026 ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సుల్లో విశేష ప్రతిభ కనబరిచినందుకు కళాశాలకు ఏ రేటింగ్ లభించిందన్నారు. ప్రతిష్టాత్మక అవార్డును 2026 జూలై 11న చైన్నైలోని ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన అవార్డుల పంపిణీ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్ ఎస్.లక్ష్మీశిరీష అందుకున్నారన్నారు. జనవరి--ఏప్రిల్ 2026 సెమిస్టర్‌లో కళాశాల నుంచి మొత్తం 923 మంది ఎన్‌పీటీఈఎల్ కోర్సులకు నమోదు చేసుకోగా, వారిలో 238 మంది విద్యార్థులు, 11 మంది అధ్యాపకులు కలిపి మొత్తం 249 మంది సర్టిఫికెట్లు సాధించారన్నారు. 19 మంది విద్యార్థులు టాపర్స్‌గా నిలిచి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారన్నారు. జాతీయ స్థాయిలో కళాశాలకు లభించిన ఈ గుర్తింపు విద్యార్థులు, అధ్యాపకుల నిరంతర కృషి, అంకితభావానికి నిదర్శనమన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఎస్. లక్ష్మీశిరీషను, అధ్యాపకులను, విద్యార్థులను, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందించారు.

## ఫీవర్ ఆస్పత్రి ఆర్ఎంఓగా డాక్టర్ పద్మావతి

గుంటూరు మెడికల్: పల్నాడు జిల్లా నరసరావుపేట డెప్యూటీ డీఎంహెచ్ఓగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మక్కెన పద్మావతిని గుంటూరు గోరంట్ల గవర్నమెంట్ హాస్పటల్ ఫర్ చెస్ట్ అండ్ కమ్యూనికబుల్ డీసీజెస్(ఫీవర్ ఆస్పత్రి) సీఎస్ ఆర్ఎంఓగా నియమిస్తూ సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి కె.సురేష్‌కుమార్ ఉత్తర్యులు జారీచేశారు. గుంటూరు వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న తాడికొండ రోమ్‌లో పనిచేస్తున్న డాక్టర్ వై.నళినీదేవిని గుంటూరు రీజనల్ ట్రైనింగ్ సెంటర్(ఫీమేల్) ప్రిన్సిపల్‌గా బదిలీ చేస్తూ సురేష్‌కుమార్ ఉత్తర్యులు జారీచేశారు. ఫీమేల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి.విజయలక్ష్మిని మన్యం పార్వతీపురం డీఎంహెచ్ఓగా నియమిస్తూ ఉత్తర్యులు జారీచేశారు. గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.బి.ఎస్.రోహిణి రత్నశ్రీని మంగళగిరి ఎన్‌టీఆర్ వైద్యసేవ టెక్నికల్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.

## ఇద్దరు అంతర్‌జిల్లా దొంగల అరెస్టు

మంగళగిరి రూరల్: మండలంలోని చినకాకాని గ్రామ పరిధిలోని హాయిలాండ్ రోడ్డులో గత నెల 17న జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో అంతర్‌జిల్లా దొంగలు వెంపాల చంటి, క్రోసూరు శ్రీనివాసరావును సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇంటికి తాళం వేసి బంధువుల వద్దకు వెళ్లిన కుటుంబాన్ని గమనించిన నిందితులు ఇంటిని రెక్కీ చేసి, తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న 16 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదును అపహరించారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 16 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని మంగళగిరి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. వెంపాల చంటిపై గతంలో సుమారు 100కు పైగా, క్రోసూరు శ్రీనివాసరావుపై 28 పైగా కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

# కానూరు ఆటోనగర్‌లో ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ దగ్ధం

పెనమలూరు: కానూరు కొత్త ఆటోనగర్‌లో శ్రీ విజయదుర్గ ఫుడ్స్(ఐస్‌క్రీమ్) ఫ్యాక్టరీ ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. రాత్రి సమయంలో ఫ్యాక్టరీలో హఠాత్తుగా మంటలు చెలరేగి ఫ్యాక్టరీ మొత్తం వ్యాపించి మిషన్‌లు, ఫర్నిచర్, సరుకు అగ్నికి కాలి బూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఫ్యాక్టరీలో మంటలు చెలరేగాయని పోలీసులు భావిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆటోనగర్‌లో వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.

# రేపు ఐటీఐలో జనరల్ కౌన్సెలింగ్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే మొదటి విడత కౌన్సెలింగ్‌లో దరఖాస్తు చేసుకుని సీటు రాని విద్యార్థులు, మొదటి విడత కౌన్సెలింగ్‌కు హాజరు కాని వారికి ఈ నెల 15వ తేదీ బుధవారం జనరల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఐటీఐ కౌన్సెలింగ్ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ రమేష్ ఆసుపత్రి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి ఈ కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందన్నారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో భర్తీ కాగా మిగిలిన సీట్లను ఈ జనరల్ కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తామని తెలియజేశారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ అన్ని ఒరిజినల్స్‌తో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలియజేశారు. వివరాలకు 0866--2475575, 94906 39639, 77804 29468 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

# ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కోనేరుసెంటర్: ద్విచక్ర వాహనం ఢీకొనటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై చిలకలపూడి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నం చిలకలపూడికి చెందిన మద్దూరి సూర్యప్రసాదరావు (53) కూలి పనులు చేస్తుంటాడు. ఆదివారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా చిలకలపూడి రైల్వేస్టేషన్‌కు సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ సూర్యప్రసాదరావును ఢీకొంది. ఈ ఘటనలో బాధితుడికి బలమైన గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు రమణసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

## ప్రశ్న చానల్ ఫ్లాట్ యజమాని, సీఈఓలను విచారించిన పోలీసులు

గన్నవరం: యూ ట్యూబర్ ప్రశ్న రావణ్‌పై గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో రాజద్రోహం, తదితర సెక్షన్ల కింద నమోదైన కేసులో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు ప్రశ్న చానల్ సీఈఓ గమన, ఆ చానల్‌కు ఫ్లాట్‌ను అద్దెకు ఇచ్చిన ఇంద్రసేననాయుడుకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారు. స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ కేసు విచారణాధికారి డీఎస్పీ కె.ధర్మేంద్ర నేతృత్వంలో వారిద్దరిని ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సుదీర్ఘంగా విచారించారు. మళ్లీ 17న విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. ఇటీవల మాదాపూర్‌లోని స్టూడియోలో స్వాధీనం చేసుకున్న సాంకేతిక పరికరాలను గమన, ఇంద్రసేననాయుడు సమక్షంలోనే సీజ్ చేసి ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం పంపించినట్లు తెలుస్తోంది. విచారణలో గన్నవరం సీఐ బీవీ శివప్రసాద్ పాల్గొన్నారు.

# ఉద్యమ కార్యాచరణపై ఉద్యోగ సంఘాలతో సమావేశం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం అనంతరం ఉద్యమ కార్యాచరణపై తుది నిర్ణయం ప్రకటిస్తామని ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా కమిటీ ప్రకటించింది. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడంపై కమిటీ హర్షం వ్యక్తం చేసింది. సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ స్వరాజ్యలక్ష్మి, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పారె లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి పాల్గొన్నారు.

# ప్రజలు కోరిన సమాచారాన్ని వెంటనే ఇవ్వాలి : ఆర్టీఐ కమిషనర్ శ్రీనివాసరావు

అచ్చంపేట: ప్రజలు కోరిన సమాచారం అందుబాటులో ఉంటే వెంటనే ఇవ్వాలని ఆర్టీఐ కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. అచ్చంపేట తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలను సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. సహ చట్టం రికార్డులు పరిశీలించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్నింటికి సమాచారం అందించారనే విషయాలను పరిశీలించారు. అధికారులు జవాబుదారీతనం కలిగి ఉండాలన్నారు. ప్రతి సమాచారం పబ్లిక్‌కు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డులు ఉంచి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఆయన వెంట సత్తెనపల్లి ఆర్డీవో గోపాలకృష్ణ, తహసీల్దారు సరోజ, డిప్యూటీ తహసీల్దారు జానీబాషా, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# రేపటి నుంచి వారాహి నవరాత్రి మహోత్సవాలు

చందోలు(కర్లపాలెం): బాపట్ల జిల్లా చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి ఆలయంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని వారాహి నవరాత్రి మహోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కె.చక్రధరరెడ్డి తెలిపారు. సోమవారం 90వ అమావాస్య దివ్యహోమం సందర్భంగా అమ్మవారికి అష్టాదశ శక్తి పీఠాలలో దేవతారూపం లేకుండా కేవలం చక్ర రూపంలో గయా క్షేత్రంలో మాత్రమే దర్శనమిచ్చే శ్రీమాధవేశ్వరి మహామాత అలంకరణలో పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా ఆలయంలో జరిగిన హోమం, విశేష పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఈడీ తనిఖీలు

పట్నంబజారు: ఏపీఎస్‌ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) జి.నాగేంద్రప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) డి.సాంబ్రాజ్యంతో క లసి డిపో--1 గ్యారేజీని పరిశీలించారు. బస్సుల మరమ్మతుల పనులను పరిశీలించారు. గుంటూరు డిపో--2లో జరుగుతున్న ఎలక్ట్రికల్ బస్సుల గ్యారేజీ పనుల గురించి ఆరా తీశారు. ఈడీ మాట్లాడుతూ ఆర్టీసీలో జరుగుతున్న పనులను పరిశీలించేందుకు వచ్చినట్లు వెల్లడించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

# శివాలయానికి పోటెత్తిన భక్తులు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణం, పరిసర ప్రాంతాల్లోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం, సోమవారం ఒకే రోజు రావడంతో పట్టణంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానానికి ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, బిల్వ దళాలతో ప్రత్యేక పూజలు చేశారు. రద్దీ కారణంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ అర్చకులు మాట్లాడుతూ మహా శైవాక్షయోగం రోజున శివునికి భక్తి శ్రద్ధలతో పూజలు, అభిషేకాలు చేయడం వలన వంద మహాశివరాత్రులు ఆచరించిన పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు, అర్చకులు అందించారు.

# వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి: వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన సత్తెనపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 21వ వార్డుకు చెందిన ఆలేటి జయబాబు పురుగు మంది తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు హుటాహుటిన పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. కాగా, పట్టణ సీఐ వేధింపుల కారణంగానే ఆత్మహత్యకు యత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావును వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

# బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

చిలకలూరిపేటటౌన్: మండలలలోని జాతీయ రహదారి--16పై జరిగిన రోడ్డు ప్రమాదంలో బొప్పూడి గ్రామానికి చెందిన కోడూరు వెంకటరమణమ్మ (65) దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బొప్పూడి గ్రామానికి చెందిన వెంకటరమణమ్మ రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం 8 గంటలకు పొగాకు కంపెనీకి కూలీ పని నిమిత్తం బయలుదేరింది. చిన్న పసుమర్రు గ్రామం సమీపంలోని చీరాల ఓడరేవుకు వెళ్లే హైవే వంతెన కింద రహదారిని దాటుతుండగా, ఒంగోలు వైపు వెళ్ను ద్విచక్ర వాహనం ఆమెను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటరమణమ్మతో పాటు, బైక్ నడుపుతున్న వ్యక్తికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చిలకలూరిపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణమ్మ పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. నాదెండ్ల మండలం గణపవరంకు చెందిన మృతురాలి కుమార్తె బత్తినేని శేషమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# ఏఎన్‌యూ ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ(పెదకాకాని): ఏఎన్‌యూ ఎమ్మెస్సీ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వెల్లడించినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎ.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 ఏప్రిల్‌లో నిర్వహించిన ఎమ్మెస్సీ ఆక్వాకల్చర్ పరీక్షలకు 41 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 40 మంది ఉత్తీర్ణులయ్యారు. అలానే ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ పరీక్షలకు 22 మందికిగానూ 20 మంది, ఎంఎస్సీ బోటరీ పరీక్షలకు 66 మందికి 38 మంది, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ పరీక్షకు 37 మంది 31 మంది ,ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ 26 మందికి 26 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎమ్మెస్సీ ఎన్విరాల్‌మెంట్ సైన్స్ పరీక్షకు 16 మందికి 16 మంది, ఎమ్మెస్సీ ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ 70 మందికి గాను 70 మంది, ఎమ్మెస్సీ జియాలజీ పరీక్షలకు ఐదుగురు, ఎమ్మెస్సీ సైకాలజీ పరీక్షకు 23 మంది హాజరు కాగా 23 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.

# 'సర్' గడువును పొడిగించాలి

## పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌ను కోరిన సీపీఐ నాయకులు

నరసరావుపేట: జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అనేక లోపాలు చోటుచేసుకుంటున్నాయని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగిపోయే ప్రమాదం ఉందని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును మరో మూడు నెలలపాటు పొడిగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం జరుగుతున్న సర్‌లో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగిపోతున్నాయనే ఫిర్యాదులు రాష్ట్రవ్యాప్తంగా వస్తున్నాయని తెలిపారు. మరణించినవారి పేర్లు, నకిలీ ఓటర్లను తొలగించడం అవసరమే అయినప్పటికీ, ఆ పేరుతో నిజమైన ఓటర్ల హక్కులు దెబ్బతినకూడదన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉలవలపూడి రాము మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించిన వారికి కూడా సరైన సమాచారం అందడం లేదని, సాంకేతిక సమస్యల కారణంగా దరఖాస్తుల స్థితి తెలియని పరిస్థితి నెలకొన్నదన్నారు. చాలా చోట్ల బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఫారాలు అందించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాజకీయ ప్రమేయానికి ఆస్కారం లేకుండా ప్రతి అర్హుడి పేరు జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ సుభాని, సీహెచ్.సత్యనారాయణరాజు, మహంకాళి సుబ్బారావు, ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్ పాల్గొన్నారు.

# టీడీపీ ప్రభుత్వానికి కొనసాగే హక్కు లేదు

## విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నాయకుల ధర్నా

## ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్

రాష్ట్రంలో రూ. వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టి విద్యార్థులకు దిక్కుతోచని స్థితి కల్పించిన టీడీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బందారపు యశ్వంత్ రఘువీర్ పిలుపు ఇచ్చారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద వందల మంది విద్యార్థులతో కలసి మహాధర్నా నిర్వహించారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యశ్వంత్ రఘువీర్ మీడియాతో మాట్లాడుతూ పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీల వరకు అనేక సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయని అన్నారు. సంక్షేమ వసతి గృహాలకు నిధులు కేటాయించక దశాబ్దగా ఖాళీగా ఉన్న కుక్, కమాటి, వార్డెన్ పోస్టులు భర్తీ కాకపోవడంతో విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో డ్రాప్ అవుట్స్ పెరిగిపోతున్నాయని తెలిపారు. డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తిచేసిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో సర్టిఫికెట్ చేతికి రాక కళాశాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నికల్, ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్య అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

**వర్సిటీలలో గాడి తప్పిన పాలన :** విద్యా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని గొప్పగా చెబుతూ యూనివర్సిటీలను గాలికి వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. నిధులు కేటాయించకుండా విద్యార్థులు తక్కువ ఉన్నారని నెపంతో చాలా వరకు విభాగాలను మూసివేస్తున్నారని అన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు మూడు వేలకు పైగా ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పోస్టులు భర్తీ చేయకపోవడం వలన యూనివర్సిటీ విద్యార్థులకు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత పీజీ చదువుకోవాలనే కలలు కొంటున్న విద్యార్థులకు సర్కారు వైఖరి ఆటంకంగా మారిందన్నారు. పీజీ కళాశాలలు మూతపడటంతో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో అధికారంలోనికి వచ్చిన వెంటనే జీవో నెంబర్ 77 రద్దు చేస్తానని చెప్పి ఇంతవరకు దాని ఊసే పట్టకపోవడం విద్యార్థులను మోసం చేయటమేనని మండిపడ్డారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గురజాల నియోజకవర్గ కార్యదర్శి దుర్గా ప్రసాద్, నాయకులు జగదీశ్, శ్రీనివాస్, మధు, సామ్యూల్ పాల్గొన్నారు.

# హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత

నరసరావుపేట రూరల్: ప్రజా రక్షణ కోసం నిరంతరం పాటుపడుతున్న పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా అదనపు ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి తెలిపారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్‌ను సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అందజేశారు. హోంగార్డుగా పనిచేస్తున్న గౌరి ప్రభాకరరావు డిప్యూటేషన్ మీద గుంటూరు ఆర్టీఓ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్నాడు. గత ఏడాది పాము కాటుతో ప్రభాకరరావు మృతిచెందాడు. మృతుని భార్య జ్యోతికి యాక్సిస్ బ్యాంక్ నుంచి రూ.34లక్షల చెక్‌ను అందించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ ఎస్.కృష్ణ, యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కె.అంకారావు, క్లస్టర్ శాలరీ మేనేజర్ తిరుమల కుమార్ పాల్గొన్నారు.

# కారును ఢీకొన్న లారీ దంపతులకు గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారి నూతన బైపాస్‌పై ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొన్న ఘటనలో కారు వెనుకభాగం నుజ్జునుజ్జుకాగా, కారులో ప్రయాణిస్తున్న దంపతులకు గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. విజయవాడ నుంచి నరసరావుపేట వెళ్తున్న కారులో దంపతులు ప్రయాణిస్తున్నారు. నూతన బైపాస్‌పై గణపవరం వద్దకు రాగానే విజయవాడ నుంచి చైన్నె వెళ్తున్న లోడు లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారు వెనుకభాగం నుజ్జునుజ్జుకాగా, దంపతులకు స్వల్పగాయాలయ్యాయి.

# మెడికల్ కాలేజీకి సీట్లు కేటాయించడం హర్షణీయం

## ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కోటా సాయికుమార్

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మెడికల్ కాలేజీకి ఎంబీబీఎస్ సీట్లు కేటాయించటం ఎంతో హర్షణీయమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కోటా సాయికుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ...పల్నాడు జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ప్రవేశాలు ప్రారంభం కావడం జిల్లాలోని విద్యార్థులకు, ముఖ్యంగా గ్రామీణ, పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. వైద్య విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంలో ఇది కీలక ముందడుగని పేర్కొన్నారు. అయితే కేవలం సీట్ల కేటాయింపుతోనే పరిమితం కాకుండా కళాశాలలో అవసరమైన అధ్యాపకులు, వైద్యసిబ్బంది, ప్రయోగశాలలు, గ్రంథాలయం, విద్యార్థులకు వసతి గృహాలు, తాగునీరు, రవాణా తదితర అన్ని మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి నాణ్యమైన వైద్య విద్య అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లాలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తూ భవిష్యత్తులో పీజీ కోర్సులు, సూపర్ స్పెషాలిటీ విభాగాలను కూడా ఈ కళాశాలలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# దళిత ఉద్యమనేత కోటి జేమ్స్ కన్నుమూత

చీరాల రూరల్: దళిత ఉద్యమనేత, చీరాల జాన్‌పేటకు చెందిన కోటి జేమ్స్ అనారోగ్యంతో సోమవారం తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు దళిత, ప్రజా సంఘాల నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కోటి జేమ్స్ మరణం దళిత ఉద్యమానికి తీరని లోటని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎల్‌టీడీ కార్మికుడిగా జీవితం ప్రారంభించిన ఆయన.. కార్మిక నాయకుడిగా హక్కుల సాధన కోసం విశేష కృషి చేశారు. కారంచేడు మారణకాండ బాధితులకు బాసటగా నిలిచి, వారికి న్యాయం జరిగే వరకు ఆర్థికంగా, నైతికంగా అండగా ఉంటూ ఎన్నో పోరాటాలు సాగించారని నాయకులు గుర్తుచేసుకున్నారు. దళిత ఉద్యమ శిఖరం డాక్టర్ కత్తి పద్మారావుకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ.. దళిత మహాసభ ఉపాధ్యక్షుడిగా ఆయన విశేష సేవలు అందించారని కొనియాడారు. అత్యంత సాధారణ జీవితం గడిపిన జేమ్స్.. చివరి దశలో క్రీస్తు పరిచర్యలో గడిపారని వివరించారు. జేమ్స్ భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మూరి కనకారావు, జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ల వాసు, దళిత, ప్రజా సంఘాల నాయకులు నీలం నాగేంద్రరావు, మాచవరపు జూలియన్, కొరివి వినయకుమార్, దారా అంజయ్య, పులిపాటి బాబురావు, గోసాల ఆశీర్వాదం, దుడ్డు భాస్కరరావు, భగత్‌సింగ్, తేళ్ల వెంకటస్వామి, బి.లక్ష్మీనరసయ్య, గొర్రెపాటి రవికుమార్ తదితరులు ఉన్నారు.

# ఏపీ సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు

## ఓపీఎస్ ఎంపికకు వన్‌టైమ్ ఛాన్స్

అమరావతి, జులై 13: ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) ఎంచుకునేందుకు ఉద్యోగులకు ఒకేసారి అవకాశం ఇస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నెం.53ను విడుదల చేసింది. 2004 సెప్టెంబర్ 1 కంటే ముందు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్లు వచ్చి, ఆ తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారు అర్హులుగా ఉండనున్నారు. ఈ ఉద్యోగులు సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ఉత్తర్వుల ప్రకారం, జీవో జారీ అయిన తేదీ నుంచి మూడు నెలల లోపు అర్హులైన ఉద్యోగులు తమ ఆప్షన్‌ను సంబంధిత అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ వెల్లడించింది. ఒకసారి ఓపీఎస్ లేదా సీపీఎస్‌కు సంబంధించి ఉద్యోగి ఎంచుకున్న ఆప్షన్‌ను మార్చుకునే అవకాశం ఉండదని ప్రభుత్వం పేర్కొంది. గడువులోపు ఎలాంటి ఆప్షన్ ఇవ్వని ఉద్యోగులు యథావిధిగా కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) పరిధిలోనే కొనసాగుతారని జీవోలో స్పష్టం చేసింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కూడిన జీవో ఎంఎస్ నెం. 53ను ఆర్థిక శాఖ అధికారికంగా విడుదల చేసింది.

# ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్త జనం

ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఈరోజు(ఆదివారం) భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇవాళ సెలవు నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచే ఆలయానికి భక్తుల రద్దీ క్రమంగా పెరిగింది. భక్తులు భారీగా తరలి రావడంతో, సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు అధికారులు ఉదయం 10:30 గంటల నుంచి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్నిరకాల వీఐపీ (ఎల్రా) దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల క్యూ లైన్లలోని సామాన్య భక్తులు అమ్మవారిని అత్యంత వేగంగా, సులభంగా దర్శించుకున్నారు. నూతన నీటి సరఫరా విధానానికి భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సరికొత్త నీటి సరఫరా విధానాన్ని ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలోని భక్తుల వద్దకే నేరుగా సరికొత్త మొబైల్ వాటర్ క్యాన్ల (సంచార నీటి డబ్బాల) ద్వారా చల్లని తాగునీటిని ఆలయ సిబ్బంది అందజేశారు. అలాగే, ఆలయ పరిసరాల్లో నిరంతరాయంగా ఉచిత ప్రసాదం, అన్నదానం విరివిగా పంపిణీ చేశారు.

# విజయవాడ ప్రభుత్వాస్పత్రి ఘటనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సీరియస్

విజయవాడ ప్రభుత్వాస్పత్రి ఘటనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సీరియస్ అయ్యారు. మృతదేహాన్ని ప్రభుత్వ మహాప్రస్థానం అంబులెన్స్ ద్వారా స్వస్థలానికి చేర్చకపోవటానికి దారి తీసిన పరిస్థితులపై విచారణకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై విచారణ జరపాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్‌ను మంత్రి ఆదేశించారు. ఇటీవల జరిగిన ఈ సంఘటన గురించి తనకు తెలిసిన వెంటనే విజయవాడ జీజీహెచ్ అధికారులతో మంత్రి మాట్లాడారు. మృతదేహాన్ని స్వస్థలానికి ప్రైవేట్ అంబులెన్స్‌లో తీసుకెళ్లారని, రాత్రి సమయంలో ఈ సంఘటన జరిగిందని ఆస్పత్రి అధికారులు చెప్పటంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాప్రస్థానం కింద అంబులెన్స్‌లు ఆస్పత్రిలో లేవా?, బాధ్యులు ఎవరు? అని ప్రశ్నించారు. మృతుని కుటుంబ సభ్యులు ఎందుకు ప్రైవేట్ అంబులెన్సును ఆశ్రయించాల్సి వచ్చిందో విచారణ జరిపి నివేదించాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు.

